


చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.60

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.60 పలికింది. కనిష్టం రూ.33, సరాసరి ధర రూ.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
36.7°/22.3°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీమాలో అవకతవకలపై విచారణకు ఆడిట్ బృందం



అనంతపురం అగ్రికల్చర్: భారీ వర్షాల కారణంగా ఖరీఫ్‌-2021లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి ఉచిత పంటల బీమా కింద మంజూరైన పరిహారం పంపిణీలో అవకతవకలు చోటు చేసుకున్నాయి. అనర్హులకు రూ.10,39,085 మేర ప్రయోజనం దక్కేలా చేశారనే అభియోగాలపై క్షేత్రస్థాయి విచారణకు కమిషనరేట్‌కు చెందిన ఆడిట్ బృందం సోమవారం జిల్లాకు చేరుకున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. విడపనకల్లు మండలం డొనేకల్లు గ్రామంలో జరిగిన అవకతవకలకు బాధ్యులను చేస్తూ ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్‌ను ఇప్పటికే సస్పెండ్ చేయగా, మండల ఏఓ, డివిజన్ ఏడీఏ, అప్పటి జేడీఏను కూడా బాధ్యులను చేస్తూ ఇటీవల కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై ఆడిట్ బృందం విచారణ చేయనున్నట్లు సమాచారం. అలాగే 2019 జూలైలో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీలో నకిలీ కూపన్లు సృష్టించి రూ.8.62 లక్షల విలువ చేసే వేరుశనగను పక్కదారి పట్టించినట్లు అప్పటి ఏఓ, ఏడీఏ, ఏజెన్సీ నిర్వాహకులపై వచ్చిన ఆరోపణలపై కూడా ఆడిట్ బృందం దృష్టి సారించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.


'పచ్చ' పైశాచికం



రాళ్ల అనంతపురం పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

కంబదూరు: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 'తెలుగు తమ్ముళ్లు' రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మండలంలోని రాళ్ల అనంతపురం గ్రామ పంచాయతీ కార్యాలయానికి సోమవారం స్థానిక తెలుగు తమ్ముళ్లు తాళాలు వేశారు. వివరాలు.. రాళ్ల అనంతపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ మంగమ్మ వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయానికి వెళ్తూ కుర్చీల్లో కుర్చొంటూ అధికార దర్పం ప్రదర్శిస్తున్నారు. సర్పంచ్‌కు కేటాయించిన కుర్చీలో సైతం దర్జాగా కూర్చుని 'అంతా మాదే.. మేము చెప్పినట్లే వినాలి.. మేము చెప్పినట్లే జరగాలి' అంటూ సిబ్బందికి హుకుం జారీ చేస్తున్నారు. ఇటీవల సర్పంచ్ చాంబర్‌లో ఎవరో మద్యం సేవించి అక్కడే బాటిళ్లు వదిలేసి వెళ్లడంతో మంగమ్మ తన చాంబర్‌కు తాళాలు వేశారు. దీన్ని కారణంగా చూపుతూ సోమవారం స్థానిక టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఏకంగా పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేశారు. ఇదేంటని సిబ్బంది అడిగితే సర్పంచ్ చాంబర్ తెరిస్తేనే పంచాయతీ కార్యాలయాన్ని తెరుస్తామని చెప్పారు. సిబ్బంది చేసేదేమీ లేక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ ప్రసాద్ గ్రామానికి వెళ్లి తాళాలు తెరిపించారు.

'ఎన్‌ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు



అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 15 వరకు పొడిగించారు. ఈ ఏడాది డిసెంబరు 8న ఈ పరీక్ష జరగనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సదుపాయం లేని మోడల్ స్కూళ్లలో ఈ ఏడాది 8వ తరగతి చదువుతున్న విదార్థులు అర్హులని పేర్కొన్నారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏటా రూ. 12 వేల చొప్పున మొత్తం రూ. 48 వేలు ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు మంచి అవకాశం అని పేర్కొన్నారు. వీలైనంత ఎక్కువమంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

తడబడి!



బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తాగునీటి కొళాయి వద్ద దుస్థితి

❐ రాయదుర్గం పట్టణంలోని కూననాగప్ప మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య తగ్గింది. 1 నుంచి 5వ తరగతి వరకు గత ఏడాది 75 మంది విద్యార్థులు ఉండగా.. ఈ ఏడాది 62 మందికి తగ్గిపోయారు. ఒకటో తరగతిలో 8 మంది మాత్రమే చేరారు. గతంలో ఈ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు పనిచేసేవారు. సర్దుబాటు కింద వీరిలో ఇద్దరిని ఇతర పాఠశాలలకు బదిలీ చేయడంతో తమ పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడటం లేదని తెలిసింది.

- ప్రభుత్వ బడుల్లో పడిపోయిన విద్యార్థుల సంఖ్య
- ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 13 వేల మంది తగ్గుదల
- అస్తవ్యస్తంగా మారిన విద్యావ్యవస్థ
- 'తల్లికి వందనం' లేక పిల్లలను బడులకు పంపడానికి తల్లిదండ్రుల అయిష్టత
- 'సర్దుబాటు' కింద ఇష్టారాజ్యంగా టీచర్లను మార్చడమూ ఓ కారణం
- గత ప్రభుత్వంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు ఆగి దయనీయంగా పరిస్థితి



బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో తాండవిస్తున్న అపరిశుభ్రత



గత ప్రభుత్వ హయాంలో సుందరంగా రూపుదిద్దుకున్న రాయదుర్గంలోని కేఎన్ఎంఎస్ స్కూల్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2023–24తో పోల్చితే 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో సుమారు 13 వేల మంది తగ్గిపోయారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'అమ్మ ఒడి' కింద ప్రతి ఏటా క్రమం తప్పకుండా రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో జమచేశారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకానికి అతీగతీ లేకుండా పోయింది. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. చాలా చోట్ల పిల్లలను బడులు మాన్పించేశారు.

కళావిహీనంగా పాఠశాలలు..

పేద విద్యార్థులు చదివే బడులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి స్కూళ్లను అందంగా తీర్చిదిద్దింది. కొత్త ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని కూడా అటకెక్కించింది. దీంతో పనులు ఆగి బడులు కళావిహీనంగా తయారయ్యాయి. అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ క్రమంలో పిల్లలను ఆకర్షించడంలో ప్రభుత్వ స్కూళ్లు వెనుకబడిపోయాయి. దీనికితోడు విద్యార్థుల చేరికలకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపట్టకపోవడమూ పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గడానికి కారణంగా తెలిసింది.

సర్దుబాటు అంటే ఇదేనా..?

స్కూళ్లలో సర్దుబాటు పేరుతో ఇష్టారాజ్యంగా జరిగిన నియామకాలు అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపినట్లు ఉపాధ్యాయులే చెబుతున్నారు. అనంతపురంలోని తపోవనం జెడ్పీ హైస్కూలులో నలుగురు గణితం టీచర్లు ఉన్నారు. వీరిలో ఒకరు ఇక్కడి నుంచి వేరే స్కూలుకు వెళ్లాల్సి ఉన్నా ఎంఈఓకు లంచం ఇచ్చి వెళ్లలేదని తెలిసింది. నగరంలోని మరో స్కూల్లో గణితం టీచర్ లేరు. ఇతర సబ్జెక్టు టీచర్‌తో బోధన చేస్తున్నారు. మచ్చుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమే. జిల్లాలో చాలా చోట్ల ఇదే దుస్థితి. 'టీచర్లు ఉంటే విద్యార్థులు ఉండరు, విద్యార్థులు ఎక్కువగా ఉన్నచోట టీచర్లు ఉండరు' అన్నట్లుగా పరిస్థితి తయారైంది. రాజకీయ జోక్యంతో ఇష్టారాజ్యంగా సర్దుబాటు జరగడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో డీఈఓపై తీవ్ర విమర్శలున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

విద్యార్థుల చేరికల్లో తేడా ఇలా..

సంవత్సరం	విద్యార్థుల చేరిక
ప్రీ ప్రైమరీ టు క్లాస్ వన్	
2023-24	59,046
2024-25	53,237
తేడా	5,809
2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు	
2023-24	3,38,262
2024-25	3,34,194
తేడా	4,068
ఇంటర్	
2023-24	44,257
2024-25	41,347
తేడా	2,910

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం



నాకు నలుగురు పిల్లలు. అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. తమ ప్రభుత్వం వచ్చాక చదువుకునే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. కానీ, ఇప్పటికీ పథకం అమలు కాలేదు. అసలు ఇస్తారో లేదో కూడా తెలియదు. గత ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలు చదువుతున్నా 'అమ్మ ఒడి' పథకం వర్తింపజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాలని అనుకుంటున్నా.

– జ్యోతి, గృహిణి, కంబదూరు

సాయం అందించాలి



మాది పేద కుటుంబం. నా భర్తకు ఇటీవల ఆపరేషన్ జరిగింది. మా నలుగురు పిల్లల్లో ఇద్దరు రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ ఉర్దూ హైస్కూల్‌లో 8,9 తరగతులు చదువుతున్నారు. మరో కుమారుడు, కుమార్తె రాజీవ్‌గాంధీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. పిల్లల కనీస అవసరాలు తీర్చేందుకు కూడా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అంతమందికీ రూ.15 వేలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంతో పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. 'తల్లికి వందనం' కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం.

– అజీరా, 24వ వార్డు, రాయదుర్గం

ఎట్టకేలకు 'సమగ్ర' ఉద్యోగులకు జీతాలు

- రెండు నెలల జీతాల బడ్జెట్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాకు రూ. 13.14 కోట్లు



సాక్షికి స్పందన

అనంతపురం ఎడ్యుకేషన్: ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. జీతాల బడ్జెట్ విడుదల చేసి సమగ్ర శిక్ష ఉద్యోగులకు పండగ పూట పస్తులు లేకుండా చేసింది. రెండు నెలలు పూర్తయినా ఆగస్టు, సెప్టెంబర్ జీతాలు అందక 'సమగ్ర శిక్ష'లో పని చేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందారు. దసరా సమీపిస్తుండడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉండేవి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష ఉద్యోగుల జీతాల ఎదురుచూపులపై మూడు రోజుల క్రితం 'సాక్షి'లో 'పండగ పూటా పస్తులేనా' శీర్షికతో ప్రత్యేక కథనం వెలువడింది. అలాగే సోమవారం ప్రధాన సంచికలో 'సారూ.. జీతాలెప్పుడు?' శీర్షికతో మరో కథనం వచ్చింది. దీంతో స్పందించిన ప్రభుత్వం ఆగమేఘాలపై సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులకు రూ. 13.14 కోట్లు విడుదలయ్యాయి. అలాగే ఆగస్టు, సెప్టెంబరు కేజీబీవీ డైట్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని కేజీబీవీలకు రూ. 2.56 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలోని కేజీబీవీలకు రూ. 2.13 కోట్లు విడుదల అయ్యాయి.

నేడు ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ

ఉమ్మడి జిల్లాలో సమగ్రశిక్ష పరిధిలో 2,800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆయా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం జీతాలు జమ కానున్నాయి. సోమవారం మధ్యాహ్నం బడ్జెట్ విడుదల చేయగానే జీతాల బిల్లులను సిద్ధం చేశారు. సాయంత్రం బ్యాంకు సమయం ముగియడంతో మంగళవారం ఉదయాన్నే బ్యాంకుకు పంపుతామని సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలియజేశారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రజలు తమ సమస్యలపై సమర్పించే అర్జీలపై నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రమేష్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 422 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. సమస్యను తెలుసుకుని వారు సంతృప్తి చెందేలా పరిష్కరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీ పరిష్కారం కాకుండానే పరిష్కారమైనట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే అది రీ ఓపెన్ అవుతుందన్నారు. ఒక్క అర్జీ కూడా రీ ఓపెన్ కాకూడదని చెప్పారు.

వినతుల్లో కొన్ని...

- ఇళ్ల మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని బుక్కరాయసముద్రం మండలం రేగడ కొత్తూరుకు చెందిన సీతారామిరెడ్డి, తదితరులు విన్నవించారు. ఆకులేడు సబ్‌స్టేషన్ నుంచి రేగడ కొత్తూరు గ్రామ నడివీధిలో నివాసాల మీదుగా 11 కేవీ విద్యుత్ లైన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తుండంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామన్నారు. గ్రామ బయటి నుంచి లైన్ వేసేలా చూడాలని కోరారు.
- తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూమిలోకి రానీయకుండా కొందరు దౌర్జన్యం చేస్తున్నారని యల్లనూరు మండలం గడ్డమాపల్లికి చెందిన రామాంజనేయులరెడ్డి ఫిర్యాదు చేశారు. మల్లగుండ్ల గ్రామపొలం సర్వే నంబరు 805–1ఎలో 4.09 ఎకరాల భూమి తమ తాతల కాలంనాటి ఆస్తి అని తెలిపారు. విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.
- గుంతకల్లు పట్టణంలో నివాసముంటున్న తాము ఇంటి గుత్త క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా బకాయి ఉన్నట్లు చెబుతున్నారని ఎస్.జోయ అఫ్రీన్ ఫిర్యాదు చేశారు. గుంతకల్లు మునిసిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెప్పారు. సమస్య పరిష్కరించాలని కోరారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

లక్ష్యాలను పూర్తి చేయాలి

వివిధ కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల పంపిణీ సమయంలో ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలతో మమేకమై పని చేయాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో వివిధ అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 వేల ఎకరాలకు సంబంధించి అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్ పరిశీలన చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 23 వేల ఎకరాలు పూర్తి చేశారన్నారు. మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన 100 ముఖ్యమైన సేవలకు సంబంధించిన బోర్డులు ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని జెడ్పీ సీఈఓ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఒక అధికారిని కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జ్‌గా నియమించాలని చెప్పారు. వారికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి ప్రభుత్వ పథకాలు, పనులు వేగవంతం చేసి సమాచారాన్ని ప్రజలకు చేరవేసేలా చూడాలన్నారు.

● జీబీసీకి గండి



జీబీసీకి గండి పడటంతో వృథాగా పోతున్న నీరు

విడపనకల్లు: గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ)కు గండి పడింది. జీబీసీ మెయిన్ కెనాల్ 29.3 కిలోమీటర్ వద్ద బ్రిడ్జి కింద ఉన్న సీసీ ప్లాట్ ఫాం కుప్పకూలి పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో నీరంతా వంకల పాలవుతోంది. జీబీసీ కింద దాదాపు 16 వేల ఎకరాల్లో రైతులు మిరప, పత్తి, వరి తదితర పంటలు సాగు చేశారు. కెనాల్‌కు ప్రతి 15 రోజులకోసారి ఎక్కడో ఒక చోట గండి పడుతుండటం, వారం నుంచి 10 రోజులు సాగునీరు బంద్ అవుతుండటంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కొంప ముంచుతోందని వాపోతున్నారు. నీరు సక్రమంగా అందకపోతే దిగుబడి తగ్గిపోయి అవస్థలు పడాల్సిన దుస్థితి తలెత్తుందని ఆందోళన చెందుతున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న 2017–18లో దాదాపు రూ.290 కోట్లతో జీబీసీ ఆధునికీకరణ పనులను నాణ్యత లేకుండా చేపట్టడంతోనే నేడు కల్వర్టులు, బ్రిడ్జిలు, సైడ్ వాల్స్ కోతకు గురవుతున్నాయని అంటున్నారు. గండిని వెంటనే పూడ్చాలని ఇరిగేషన్ అధికారులను కోరుతున్నారు.

● అంతటా శరన్నవరాత్రుల వైభవం

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది. విద్యుద్దీపాలంకరణలతో అమ్మవారి ఆలయాలు వెలుగులీనుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కదిరి లక్ష్మీనరసింహస్వామి శ్రీకృష్ణావతార అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలోని కొత్తూరులో గాయత్రి దేవి అలంకరణ



శ్రీకృష్ణావతార అలంకారంలో ఖాద్రీశుడు

చనిపోవాలనుకుని పాపను వద్దనుకుంది

- కదిరి బస్టాండులో పసిపాపను వదిలి వెళ్లిన తల్లి ఆచూకీ లభ్యం
- గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతిగా గుర్తింపు

కదిరి టౌన్: స్థానిక బస్టాండులో ఐదు నెలల శిశువు (బాలిక)ను వదిలి వెళ్లిన మహిళ ఆచూకీ దొరికింది. వివాహమై ఇద్దరు పిల్లలు కలిగాక భర్త మృతి చెందడం, ఆ తర్వాత మరొకరితో వివాహం కాగా, అతని వేధింపులు ఎక్కువై ఆత్మహత్య చేసుకోవాలనుకున్న సదరు మహిళ రెండో భర్త ద్వారా కలిగిన శిశువును కదిరి బస్టాండులో వదిలి వెళ్లింది. కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు...

రెండో భర్త వేధించడంతో...

గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన జ్యోతికి వివాహమై ఇద్దరు పిల్లలు సంతానం. భర్త మృతి చెందడంతో సంతానాన్ని అత్తమామలే చూసుకుంటున్నారు. దీంతో జ్యోతి ఉపాధి కోసం బెంగళూరు వెళ్లింది. అక్కడ కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపూర్ దగ్గర గల బేతం గ్రామానికి చెందిన కుమార్‌ను వివాహం చేసుకుంది. ఐదునెలల క్రితమే జ్యోతి చిన్నారికి జన్మనిచ్చింది. అయితే రెండో భర్త కుమార్ వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఆదివారం అక్కడి నుంచి బయలుదేరి కదిరికి చేరుకుంది. కదిరిలోనే ఏదో ఒక పనిచేసుకుని బతకాలనుకుంది. అనంతరం మనసు మార్చుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో పసిపాపను బస్టాండ్‌లో ఉన్న ఓ ప్రయాణికురాలికిచ్చి బాత్రూమ్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిపోయింది. ఎంతకీ జ్యోతి తిరిగి రాకపోవడంతో సదరు ప్రయాణికురాలు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారిని ఐసీడీఎస్ సిబ్బందికి అప్పగించారు. చిన్నారిని వదలివెళ్లిన మహిళ కోసం తీవ్రంగా గాలించారు. ఈ క్రమంలోనే ఆత్మహత్య చేసుకునేందుకు వెళ్లిన జ్యోతి అందుకు ధైర్యం సరిపోక ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. సోమవారం కదిరి సమీపంలో సంచరిస్తున్న జ్యోతిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు ఆరా తీయగా.. తానే బస్టాండులో బిడ్డను వదిలేసి వచ్చినట్లు తెలిపింది. దీంతో ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తర్వాత పాపను అప్పగిస్తామని, అంతవరకూ శిశువును పుట్టపర్తిలోని శిశువిహార్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ఫిర్యాదులను పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందే ఫిర్యాదుల పరిష్కారాన్ని తొలి ప్రాధాన్యతగా గుర్తించాలని సంబంధిత అధికారులను ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపై ఉందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 99 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వినూత్న మార్పులపై హర్షం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కళ్యాణదుర్గం: ట్రైనీ కలెక్టర్ వినూత్న తనదైన శైలిలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె... కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. రిసెప్షన్ కౌంటర్‌లో పది మంది అర్జీదారులు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. వారికి ఎదురుగా ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రత్యేకంగా రూపొందించిన దరఖాస్తులో నమోదు చేసేలా చర్యలు చేపట్టారు. అర్జీని నేరుగా ఆర్డీఓ పరిశీలించి, సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడమే కాక వెంటనే రసీదు అందజేస్తూ సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించేలా ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమకెంతో సౌకర్యవంతంగా ఉన్న వినూత్న మార్పులపై పలువురు అర్జీదారులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 32 వినతులు అందినట్లు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

సహచరులే హంతకులు!

- మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి కేసులో వీడిన మిస్టరీ
- ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిబాబు

రాయదుర్గం: ఈ నెల 1న చోటు చేసుకున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలను రాయదుర్గం అర్బన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మారెమ్మ గుడి వీధిలో నివాసముంటున్న కొల్లప్ప మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 29న బొమ్మనహాళ్ కేజీబీవీలో చదువుతున్న కుమార్తెను చూసి వస్తానంటూ ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన రెండు రోజులైన తిరిగి రాకపోవడంతో సోదరుడు లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గౌడ లే అవుట్ సమీపంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఈ నెల 1న కొల్లప్ప మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విభేదాలే హత్యకు కారణం

రాయదుర్గానికి చెందిన దాస పవన్, దాస మధుసూదన్, కొల్లప్ప ముగ్గురూ ఎంతో సన్నిహితంగా ఉండేవారు. అంతేకాక వీరి మధ్య కొన్ని చెడు వ్యసనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికి పవన్, మధుసూదన్ నుంచి కొల్లప్ప డబ్బు తీసుకున్నాడు. అనంతరం ఉద్యోగం ఇప్పించకపోవడంతో విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో కక్ష పెంచుకున్న పవన్, మధుసూదన్ పక్కా ప్రణాళిక రూపొందించుకుని 29న రాత్రి కొల్లప్పను జగనన్న కాలనీలో నిర్మాణదశలో ఉండే ఓ పాడుబడ్డ ఇంటి వద్దకు రప్పించుకున్నారు. అనంతరం ముగ్గురూ కలసి మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వారి మధ్య మాటమాట పెరగడంతో చేతికి అందిన రాయితో కొల్లప్ప తలపై దాడి చేసి, హతమార్చి అక్కడి నుంచి ఉడాయించారు. రెండు రోజుల తర్వాత ఈ నెల 1న కొల్లప్ప మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో నిందితులను సోమవారం సాయంత్రం పల్లెపల్లి గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం నిందితులను మంగళవారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. నిందితుల అరెస్టులో చొరవ చూపిన సీఐ జయనాయక్, ఎస్‌ఐ బుల్లెట్ వలి, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఆటో బోల్తా - వృద్ధుడి మృతి



మృతి చెందిన పెద్దన్న

కూడేరు: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన పెద్దన్న (68), మరికొందరు సోమవారం ఉదయం పనిపై ఆటోలో కూడేరుకు బయలుదేరారు. మార్గం మధ్యలో అంతరగంగ గ్రామం వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా పరుగున వచ్చిన మేకపోతును తప్పించే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో గాయపడిన పెద్దన్నతో పాటు మునెమ్మ, సువర్ణను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉన్న పెద్దన్నకు ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు ఆయన స్పందించక మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఏఎంసీలో సీ ప్యాప్ మాస్క్‌ల కొరత



జీజీహెచ్‌లో ఉన్న రెండే మాస్క్‌లు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ) యూనిట్‌లో సీ ప్యాప్ మిషన్లకు వినియోగించే మాస్క్‌లు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అడ్మిషన్‌లో ఉండే 30 మంది రోగులకు కేవలం రెండంటే రెండే మాస్క్‌లు మాత్రమే ఉన్నాయి. అత్యవసర సమయంలో ప్రాణవాయువును వేగంగా అందించేందుకు ఈ మాస్క్‌లు ఉపయోగపడతాయి. ఒక్కో మాస్క్ ధర రూ.3వేలు ఉంటుంది. అయితే మాస్క్‌లను అందుబాటులో ఉంచడంలో జీజీహెచ్ అధికారులు విఫలమయ్యారు. ఉన్న రెండు మాస్క్‌లతోనే సరిపెడుతున్నారు. వాస్తవానికి ఒకరికి ఉపయోగించిన మాస్క్‌లను మరొకరికిరి వినియోగించాల్సి వస్తే తప్పనిసరిగా స్టెరిలైజ్ చేయాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా నీటితో కడిగి, స్పిరిట్‌తో తుడిచి రోగులకు అమర్చి సరికొత్త అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

పెన్నానదిలో ఘర్షణ వాతావరణం



తాడిపత్రి పోలీసు స్టేషన్ ఎదుట నిలిపిన ఎద్దుల బండ్లు



పెన్నానదిలో ఘర్షణ పడుతున్న వారికి సర్దిచెబుతున్న సీఐ శివగంగాధరరెడ్డి

- ఇసుక తరలింపును అడ్డుకున్న రజకులు
- బతుకుదెరువుపై దెబ్బతీస్తున్నారంటూ ఎద్దుల బండి నిర్వాహకుల నిరసన
- ఇరువర్గాల మధ్య ఘర్షణ

తాడిపత్రి రూరల్: స్థానిక పెన్నానదిలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎద్దుల బండ్లపై ఇసుక తరలింపును రజకులు అడ్డుకున్నారు. దీంతో తమ పొట్ట కొడుతున్నారంటూ ఎద్దుల బండి నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పరస్పర తోపులాట చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి, సిబ్బంది అక్కడకు చేరుకుని ఘర్షణను అడ్డుకున్నారు. అనంతరం విడివిడిగా స్టేషన్‌కు రప్పించుకుని మాట్లాడారు. రజకులు మాట్లాడుతూ.. కుల వృత్తిపై ఆధారపడిన తాము వందలాది మంది కొన్ని దశాబ్దాలుగా పెన్నానదిలో దుస్తులు ఉతుకుతున్నామన్నారు. ఉతికిన దుస్తులను ఆరవేసే ప్రాంతం మీదుగా ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్నారు. దీంతో సమస్య ఉత్పన్నమై పలు మార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దక్కక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇటీవల ఇసుక తరలింపు ఎక్కువ కావడంతో అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఎద్దుల బండ్లతో నిరసన

ఇసుక తరలింపును రజకులు అడ్డుకుని తమకు బతుకు తెరువు లేకుండా చేస్తున్నారంటూ అప్‌గ్రేడ్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట వందకు పైగా ఎద్దుల బండ్లను నిలిపి యజమానులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆందోళనకారులతో సీఐ చర్చించారు. ఇసుక తరలింపును సజావుగా జరగడానికి రజకులను హెచ్చరించాలని కోరారు. ఇరువురి వాదనలు విన్న సీఐ ఎటు తేల్చుకోలేక శాంతి భద్రతలకు భంగం కలగకుండా శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని సూచించి, అక్కడి నుంచి పంపించేశారు. దీంతో సమస్యను ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ఇరు వర్గాలు సిద్ధమయ్యాయి. అయితే వారిద్దరూ స్థానికంగా తాము లేమని, మంగళవారం వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.

సెల్ఫీ తీసుకుని... స్టేటస్‌లో పెట్టి!

- యువకుడి ఆత్మహత్య



ఉరి వేసుకునే సమయంలో వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన రాజారెడ్డి సెల్ఫీ

రాప్తాడు రూరల్: ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునే ముందు సెల్ఫీ తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టిన అంశం సంచలనం రేకెత్తించింది. వివరాలు... అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన డి.రాజారెడ్డి (38) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్యతో పాటు పది, 8వ తరగతి చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు చవిచూసిన రాజారెడ్డి కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గ్రామ సమీపంలోని ఓ తోటలో చెట్టుకు చున్నీ కట్టి మెడకు తగిలించుకుని తన మొబైల్‌లో సెల్ఫీ తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. అనంతరం మెడకు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వాట్సాప్ స్టేటస్ చూసిన రాజారెడ్డి స్నేహితులు వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు, బంధువులు ఏకమై చుట్టుపక్కల ప్రాంతాలను గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సమాచారం ఇవ్వడంతో జీపీఎస్ ఆధారంగా రాజారెడ్డి మొబైల్ నంబర్ ఏ ప్రాంతంలో ఉన్నదో ఇటుకలపల్లి పోలీసులు పసిగట్టి తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకునే లోపు ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజారెడ్డి కనిపించాడు. వెంటనే ఆయనను కిందకు దించి సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డీసీసీబీలో 444 రోజుల డిపాజిట్ పథకం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డీసీసీబీ సీఈఓ సురేఖారాణి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో ఖాతాదారులకు ఉపయోగపడేలా కొత్తగా 444 రోజుల డిపాజిట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీసీసీబీ సీఈఓ కె.సురేఖరాణితో కలసి డిపాజిట్ అవగాహన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అమృత్‌కాల్ పేరుతో అమలు చేస్తున్న 444 రోజుల డిపాజిట్ పథకంలో సీనియర్ సిటిజన్లకు 8.35 శాతం, ఇతరులకు 7.85 శాతం మేర వడ్డీరేటు వర్తిస్తుందన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై అత్యధిక రుణాన్ని అందజేస్తున్న సీఈఓ తెలిపారు. విలువైన వస్తువులు, ఆభరణాలు భద్రపరచుకునేందుకు లాకర్ల సదుపాయమూ ఉందన్నారు. అన్ని రకాల ఆధునిక సేవలు అందిస్తున్న డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం అర్బన్: విమర్శలకు తావివ్వకుండా కారుణ్య, ఇతర కేటగిరీల కింద ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. వివిధ కేటగిరీల కింద నియామకాల అంశంపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు.

కారుణ్య నియామకాలు, స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నియామకాలు, బ్యాక్‌లాగ్ పోస్టులు, విభిన్న ప్రతిభావంతుల కేటగిరీ కింద నియామకాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రమేష్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కోఠారి, డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రమణారెడ్డి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, సి-సెక్షన్ సూపరింటెండెంట్ వసంతలత, ఎ-సెక్షన్ డీటీలు ఆంజనేయులు, లీలాకాంత్, ఎస్‌ఏలు హుమేరా, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అనంతపురం ఎడ్యుకేషన్: శాస్త్రీయ విద్య కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వర్క్ షాపు మూడో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు సమాజంలో వస్తున్న మార్పులపై అధ్యయనం చేసేలా విద్యావిధానాన్ని రూపొందించాలన్నారు. నూతన విద్యావిధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన భావాలను తీసుకొస్తోందని మండిపడ్డారు. చరిత్రను వక్రీకరణ చేస్తూ స్వాతంత్ర పోరాటంలో ఏ పాత్ర లేని ఆర్ఎస్ఎస్ నాయకులను పోరాట యోధులుగా పాఠ్యాంశాలలో చేరుస్తుండడం బాధాకరమన్నారు. దీనివల్ల రాష్ట్రాల సంస్కృతి, చరిత్ర కనుమరగవుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై నేటికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం పాలకుల వైఫల్యాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కుమార్, ఎ. అశోక్, ఉపాధ్యక్షులు రామ్మోహన్, పరమేష్, వినోద్, నాయుడు, సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, సభ్యులు రజిత, అమూల్య పాల్గొన్నారు.

చిన్నారిపై అసభ్య ప్రవర్తన

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని జాకీర్ కొట్టాలలో చిన్నారి పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. జాకీర్ కొట్టాలకు చెందిన రవీంద్ర అలియాస్ రవి కేటరింగ్ పనితో జీవనం సాగిస్తున్నాడు. వివాహితుడైన రవీంద్రను భార్య వదిలిపెట్టింది. ఈ క్రమంలో సోమవారం తన ఇంటి వద్ద ఒంటరిగా కనిపించిన 7 ఏళ్ల వయసున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. తాకరాని చోట్ల తాకుతూ పైశాచిక ఆనందాన్ని పొందాడు. ఘటనతో భయపడిన బాలిక ఏడుస్తూ వెళ్లి తల్లిదండ్రులకు విషయం తెలపడంతో వారు అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ అనంతరం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి



లేపాక్షి (ఫైల్)

గుమ్మఘట్ట: విషపురుగు కాటేయడంతో ఓ రైతు మృతి చెందాడు. వివరాలు... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన లేపాక్షి (44)కి భార్య సునీతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. తన కున్న ఐదు ఎకరాల పొలంలో వక్క, మొక్కజొన్న పంటలను సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో చేతికి వచ్చిన మొక్కజొన్న పంటలో సోమవారం ఉదయం కూలీలతో కలసి కంకులు తొలగించే పనిలో నిమగ్నమైన లేపాక్షిని పాము (రక్తపింజర) కాటేసింది. ఆ సమయంలో భయంతో ఒక్కసారిగా గట్టిగా కేక వేస్తూ ఆయన కిందపడిపోయాడు. గమనించిన కూలీలు వెంటనే తేరుకుని లేపాక్షిని హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స మొదలు పెట్టేలోపు ఆయన మృతి చెందాడు. పెద్దదిక్కును కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్తులు డిమాండ్ చేశారు.


విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



నగేష్ (ఫైల్)

పెద్దవడుగూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరులో వీధి దీపాల మరమ్మతులు, కొత్త బల్బుల ఏర్పాటు పనులను చింతలచెరువు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ కుమ్మర నగేష్ (40)కు గ్రామ సర్పంచ్ అప్పగించారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా గ్రామంలో వీధి దీపాలను అమర్చే పనిలో నగేష్ నిమగ్నమయ్యాడు. సోమవారం ఉదయం ఎల్‌సీ తీసుకుని గుత్తి రోడ్డులో ఉన్న మసీద్ సమీపంలో, వంక వీధిలో స్తంభం పైకి ఎక్కి వీధి దీపాలు అమరుస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురై కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామంలోని కొందరు ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న ఇన్వర్టర్ల ద్వారా కరెంట్ సరఫరా జరిగి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ చిన్న రెడ్డప్ప తెలిపారు. కాగా, మృతుడికి భార్య భోగేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాహనం ఢీ - వృద్ధుడి దుర్మరణం



ఓబుళప్ప (ఫైల్)

చెన్నేకొత్తపల్లి: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... సీకే పల్లి మండలం న్యామద్దెల గ్రామానికి చెందిన ఓబుళప్ప(75) స్థానిక 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న రైస్ మిల్లులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు దూసుకెళ్లిపోయాడు. కాగా, వాహనం ఢీకొన్న వెంటనే ఓబుళప్ప ఎగిరి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చీకటి పడినా ఇంటి పెద్ద రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం ఉదయం మరోసారి జాతీయ రహదారి పక్కన గాలిస్తుండగా ముళ్లపొదల్లో ఓబుళప్ప మృతదేహం లభ్యమైంది. ఘటనపై సీకేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'యూట్యూబ్ ఛానల్ నిర్వహకుడిపై చర్యలు తీసుకోండి'

అనంతపురం: యూట్యూబ్ ఛానల్‌లో పనిచేస్తున్న గాజుల అమరేశ్వర అనే వ్యక్తి తమ కొడుకు సంతకాన్ని ఫోర్జరీ చేసి 30 సెంట్ల స్థలాన్ని లాక్కొనేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నాడంటూ ఎస్పీ జగదీష్ ఎదుట బాధితురాలు బండెప్పగారి పుష్పావతి వాపోయింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసింది. వివరాలు ఆమె మాటల్లోనే... 'మాది కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామం. నా భర్త బండప్పగారి శ్రీనివాసరెడ్డి ప్రస్తుతం లివర్, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్నాడు. మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు గ్రామంలో కళ్యాణదుర్గం- అనంతపురం బైపాస్ రోడ్డు పక్కన సర్వే నంబర్ 98-1 ఏ లో 30 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. నా రెండో కుమారుడు రంజిత్ రెడ్డి రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. నా భర్త చికిత్సకు, కుటుంబ అవసరాలకు రూ.30 లక్షల వరకూ అప్పులయ్యాయి. చాలా బాధల్లో ఉన్న మా వద్దకు పరిచయం లేని వ్యక్తి వచ్చి తాను అనంతపురం నగరం పాపంపేటకు చెందిన గాజుల అమరేశ్వరగా పరిచయం చేసుకున్నాడు. గతంలో కలెక్టరేట్‌లో, ఎస్పీ కార్యాలయాల్లో పనిచేశానని, ప్రస్తుతం యూ ట్యూబ్ ఛానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నానని తెలిపాడు. అందరితోనూ తనకు పరిచయం ఉందని, 30 సెంట్ల భూమి తనకే అమ్మాలని ఒత్తిడి చేశాడు. అయితే మాకు డబ్బు సమకూరిందని, భూమి అమ్మే అవసరం లేదని స్పష్టంగా చెప్పాను. పొలం అమ్మకపోతే ఛానల్‌లో లేనిపోనివి చూపి ఇబ్బంది పెడతానని బెదిరించాడు. అయినా పలుకుబడి ఉన్న వ్యక్తితో ఎందుకులే అని ఊరుకున్నాం. ఈ నెల 3న నా రెండో కొడుకు రంజిత్‌రెడ్డి, నా భర్త ఇద్దరూ కలసి 2024, సెప్టెంబర్ 17న అమరేశ్వర భార్య గాజుల లత పేరుతో భూ విక్రయానికి సంబంధించి అగ్రిమెంట్ చేసినట్లు ఫోర్జరీ పత్రాలను తీసుకొచ్చి చూపించి బెదిరింపులకు దిగాడు. వాస్తవానికి మా రెండో కొడుకు రంజిత్ రెడ్డి మృతి చెంది ఇప్పటికే రెండేళ్లవుతోంది. గత నెలలో ఎలా సంతకం చేస్తాడు అని అడిగినా వినకుండా లీగల్ నోటీసు పంపాడు. నవంబర్ 16వ తేదీ లోపు భూమి రిజిస్ట్రేషన్ చేయించాలని పేర్కొన్నాడు. ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని మమ్మల్ని కాపాడండి' అంటూ ఎస్పీని బాధితురాలు వేడుకుంది.

జెడ్పీ ఎదుట కార్మికుల ధర్నా



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

అనంతపురం సిటీ: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సోమవారం ధర్నా నిర్వహించారు. ఏడు నెలలుగా తమకు వేతనాలతో పాటు పీఎఫ్ మొత్తం చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే అంశానికి సంబంధించి గత నెల 29 నుంచి తాము సమ్మె చేస్తున్నా కలెక్టర్ గానీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కానీ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే తాము ఎలా బతకాలంటూ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు అక్కడకు చేరుకుని కార్మికులకు మద్దతు తెలిపారు.అనంతరం కార్మికులు, కార్మిక సంఘం నాయకులు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఓబులు, నాగమణి, ఎర్రస్వామి, రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లాలెప్ప (ఫైల్)

పామిడి: మండలంలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని అంబేడ్కర్ కాలనీలో నివాసముంటున్న ఎం.లాలెప్ప (56)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గుత్తిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అటెండర్‌గా పనిచేస్తూ టుంబాన్ని పోషించుకుంటున్న లాలెప్ప సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతూ 44వ జాతీయ రహదారిపై గజరాంపల్లి వద్ద ఉన్న శ్రీనివాస మిల్క్ డెయిరీ వద్దకు చేరుకోగానే ఐచర్ వాహనం ఢీ కొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లాలెప్పను స్థానికులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపూ పామిడి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మేయర్ వసీంను కలసిన నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర రావు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ భాస్కర్ రావును మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం ఎస్ఈగా బాధ్యతలు తీసుకున్న అయన నగరపాలక సంస్థలో మేయర్ వసీంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎస్ఈతో చర్చించిన మేయర్.. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. నగరంలో పలు పనులకు టెండర్లు పూర్తి అయ్యాయని తెలిపారు. అగ్రిమెంట్ దశలో చాలా పనులున్నాయని ఆ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మేయర్‌ను ఏఈ రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

ఉపాధి పనులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి

ఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనులపై ప్రజలకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ స్వామి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం, పొలం గట్లపై మొక్కలు నాటడం తదితర పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని తెలిపారు. మండలంలో అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలని ఆదేశించారు. అదే విధంగా పంచాయతీ పాలనపై సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కమ్మక్క, ఏపీఓ సుజిత, ఏఈ పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, హౌసింగ్ ఏఈ జమీల్ అహమ్మద్, ఈసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగకు రిజిస్ట్రేషన్



ఆత్మకూరులో పప్పుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

ఆత్మకూరు: ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం నల్లరేగడి భూములు ఉన్న రైతులు రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో పప్పుశనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేశారు. మరోవైపు పీఎమ్ కిసాన్ నగదు పడని రైతుల సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. నల్లరేగడి భూములు ఉన్న రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే త్వరలోనే పప్పుశనగ విత్తనాలు వస్తాయని తెలియజేశారు.

ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని ఇంజినీర్లను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం ఇంజినీర్లతో మాట్లాడారు. పాతూరు, తిలక్ రోడ్డు, అశోక్‌నగర్, హౌసింగ్ బోర్డు, తదితర ప్రాంతాల్లో ఏర్పడ్డ గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బిక్కి కృష్ణకు 'సాహిత్య యశో భూషణ' పురస్కారం



అవార్డు అందుకుంటున్న కవి బిక్కి కృష్ణ

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి బిక్కీ కృష్ణ సాహిత్య సేవా యశోభూషణ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వారు ఏటా ప్రతిష్టాత్మకంగా ఇచ్చే అవార్డును సోమవారం హైదరాబాదులో ప్రజాకవి గోరేటి వెంకన్న, ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ నరసింహప్ప, ప్రముఖ కవి విద్యాధర్, భీరం సుందరరావు, ఫౌండేషన్ నిర్వాహకులు జనార్ధన్, విజయలక్ష్మీ పండిట్ చేతుల మీదుగా స్వీకరించారు. నిర్వాహకులు రూ.50 వేల నగదు బహుమతి అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో సంచలనంగా మారిన బిక్కీ కృష్ణ సాహిత్య సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.

పశువుల సంచారం..

ప్రాణ సంకటం

నగరంలో పశువుల సంచారం అధికమైంది. రోజూ పశువుల మంద రోడ్లపై తిరగడం, పడుకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఏ పశువు ఎక్కడి నుంచి దూసుకొస్తుందో తెలియక వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. బత్తలపల్లి, బెంగళూరు, రాప్తాడు హైవే వద్ద రోడ్డుపై అకస్మాత్తుగా పశువులు పోట్లాటకు దిగుతుండటంతో అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు కిందపడి గాయాల పాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇటీవల కలెక్టరేట్ వద్ద పశువుల మంద అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వారు కిందపడి గాయపడ్డారు. ఆదివారం తపోవనం నేషనల్ హైవేలో కారు ఢీ కొనడంతో ఓ ఆవు మృతి చెందింది. కారు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అదృష్టవశాత్తూ అందులో ప్రయాణిస్తున్న వారు ప్రాణాలతో బయటపడ్డారు. పశువులను రోడ్లపై వదిలితే జరిమానా విధిస్తామని.. నగరపాలక సంస్థ అధికారులు హెచ్చరించినా ఫలితం లేకుండా పోతోంది. కనీసం ఇప్పటికైనా పశువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రాప్తాడు హైవే వద్ద గుంపుగా వస్తున్న పశువులు



ఇటీవల తపోవనం వద్ద నేషనల్ హైవేపై కారు ఢీ కొనడంతో మృతి చెందిన ఆవు



ట్రిపుల్ ఎస్ కళాశాల వద్ద..



ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద వాహనాలకు అడ్డంగా వస్తున్న పశువులు



ఇటీవల కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రమాదంలో కిందపడిన ద్విచక్ర వాహనదారులు

వరద బాధితులకు ఆర్థికసాయం



కలెక్టర్ వినోద్ కుమార్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: సామాజిక బాధ్యతగా వరద బాధితులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం శింగనమల మండలం శోధనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.10 వేలు సేకరించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన పాఠశాల స్కూల్ అసిస్టెంట్ వివేకానంద ఆ మొత్తానికి చెక్కు అందజేశారు.

గరుడ వాహనంపై శ్రీవారి వైభవం



పూజలందుకున్న శ్రీనివాసుడు

అనంతపురం కల్చరల్: నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగాడు. ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో జరిగిన వివిధ రకాల అభిషేకాలు, హోమాల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, సభ్యులు, అర్చకులు ఏఎల్ఎన్ హరికిషోర్ శర్మ తీర్థప్రసాదాలందించి సత్కరించారు. సాయంత్రం పల్లకీ సేవలో నగరవీధుల్లో స్వామి వారు ఊరేగుతున్నప్పుడు కళాకారులు సంప్రదాయ నృత్యాలు, భక్తిగీతాలతో స్వామికి నీరాజనాలర్పించారు. శ్రీనివాసనగర్, హౌసింగ్ బోర్డులోని వేంకటేశ్వరాలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం రూరల్: వివిధ సమస్యపై ప్రజల నుంచే వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను హెచ్చరించారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అనంతపురం అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని మండల కేంద్రాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసిందన్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులపై ఉందన్నారు. ప్రజల నుంచే వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలన్నారు. అర్జీదారులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వడంతో పాటు ఎప్పటిలోగా సమస్య పరిష్కారమవుతుందో తెలియజేయాలన్నారు. అనంతపురం అర్బన్, రూరల్ మండలాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ హరికుమార్, రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు న్యాయం చేయండి



కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చిన చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం అర్బన్: మద్యం దుకాణాల కేటాయింపులో కల్లుగీత సొసైటీలకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. మద్యం పాలసీలో కల్లుగీత సామాజిక వర్గానికి మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే చాలా మంది కార్మికులు వృత్తిని విడిచి ఇతర వ్యాపారాలు, వ్యాపకాలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడ్డారన్నారు. ఇప్పుడు రిజర్వేషన్ డబ్బున్న వారికి అమలు చేస్తే తరాలుగా కల్లుగీత వృత్తినే నమ్ముకున్న జీవనం సాగిస్తున్న కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్లు గీత సొసైటీలకు మాత్రమే 10 శాతం రిజర్వేషన్ అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు పోతులయ్య, హరికృష్ణ, నాగప్ప, గోవిందరాజులు, వీరాంజి, ఈశ్వరమ్మ, బండి వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: రేషన్ బియ్యం కోసం ఆరు కిలోమీటర్లు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినా బియ్యం కొంత మందికి అందడం లేదు. మాకు రేషన్ బియ్యం అందేలా చేసి సమస్యను పరిష్కరించాలని మండలంలోని పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పి.కొత్తపల్లి గ్రామం ఆత్మకూరు పంచాయతీ పరిధిలో ఉండటంతో ఇబ్బందిగా ఉందన్నారు. గ్రామంలోని రేషన్ దుకాణంలో ఉన్న వారందరికీ బియ్యం సరిపోవడం లేదని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ లక్ష్మీనాయక్ మాట్లాడుతూ.. లబ్ధిదారులందరికీ బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం: బహిరంగ ప్రదేశాల్లో మట్కా నిర్వహిస్తున్న 7 మందిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. మట్కా బీటర్ల నుంచి రూ.70,500 నగదు, మట్కా చీటీలు, బాల్‌పెన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు చాకలి చలపతి, శనివారపు గోవర్ధన రెడ్డి అలియాస్ గోపి, బాచి ఆదినారాయణ, దూదేకుల మహబూబ్ బాషా, షేక్ ఫక్రుద్దీన్, సయ్యద్ మహమ్మద్ బాషా, కొండకాయల జబీ ఉల్లాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆత్మకూరు డీటీగా బాలమ్మ

ఆత్మకూరు: నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా బాలమ్మ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ డీటీగా పని చేస్తున్న వరప్రసాద్ బదిలీపై వెళ్లారు. అదే విధంగా బి.యాలేరు వీఆర్వోగా నాగేంద్ర, తోపుదుర్తి వీఆర్వోగా వసంత రాయుడు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అధికారులకు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

శాంతియుత చర్చలతో పరిష్కారం



శాంతి ర్యాలీలో పాల్గొన్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ (సీ) నాయకులు

అనంతపురం అర్బన్: ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అడ్డుకట్ట వేయకపోతే ప్రపంచ దేశాలు ప్రమాదంలో పడతాయని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా జాతిని అంతమొందించేందుకు అక్కడి పౌరులే లక్ష్యంగా ఇజ్రాయిల్ యుద్ధం చేస్తోందన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం ఆపాలంటూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు శాంతి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి సోమవారానికి ఏడాది పూర్తయ్యిందన్నారు. పాలస్తీనా ప్రజలను లక్ష్యంగా చేసుకుని వైమానిక, భూతల దాడులు చేస్తోందన్నారు. ఈ దాడుల్లో ఒక్క గాజాలోనే దాదాపు 42 వేల మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రక్షిత శిబిరాల్లో తలదాచుకున్న బాధిత పాలస్తీనీయులకు సహాయం చేసేందుకు వెళుతున్న అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలను ఇజ్రాయిల్ అడ్డుకుంటోందన్నారు. మానవ హననానికి, హింసకు అడ్డుకట్ట వేయాలన్నారు. శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని అంతర్జాతీయ ప్రగతిశీల శక్తులు నినదిస్తున్నాయన్నారు. దాడులకు స్వస్తి చెప్పి కాల్పుల విరమణ పాటించాలని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించినా ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడాన్ని ప్రపంచ దేశాలు ఖండించాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవింద రాజులు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకుడు కెప్టెన్ షేకన్న, ఐఎంఎం బాషా, రచయితలు నాగేంద్ర, వీరన్న, సీపీఎం నాయకులు ఆర్‌వీ నాయుడు, నామగణి, రామాంజనేయులు, వెంకట నారాయణ, అచ్యుత్, అవాజ్ వలి, చంద్రిక, ఇర్ఫాన్, గౌస్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్న, అశోక్, పరమేష్, తిరపాల్, రమణయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

అనంతపురం అర్బన్: పాలస్తీనాపై చేస్తున్న అమానుష దాడులను ఆపాలంటూ ఎస్‌యూసీఐ(సీ) పార్టీ నాయకులు సోమవారం స్థానిక టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.రాఘవేంద్ర మాట్లాడుతూ.. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం సోమవారం నాటికి ఏడాది పూర్తయిందన్నారు. అమానుష దాడులను ఇజ్రాయిల్ ఆపాలంటూ ప్రపంచవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అమెరికా అండతో గాజాపై పాశవిక దాడులను ఇజ్రాయిల్ కొనసాగిస్తోందని మండిపడ్డారు. దేశ ప్రజలందరూ పాలస్తీనా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తబ్రేజ్‌ఖాన్, నాగముత్యాలు, సుబ్రమణ్యం, నరేంద్ర పాల్గొన్నారు.

లోకజనని.. కరుణ రూపిణీ



పాతూరు అమ్మవారి శాలలో గజలక్ష్మి అలంకరణ



కొత్తూరు అమ్మవారి శాలలో నవధాన్యాల అలంకరణ



2వ రోడ్డులోని జ్ఞానపీఠంలో కొలువుదీరిన అమ్మవారు



రాప్తాడు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ దేవి



ఆత్మకూరు: అర్ధనారీశ్వర అలంకరణలో వాసవీ మాత

అనంతపురం కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాడవాడలా అమ్మవార్లు విభిన్న రూపాల్లో దర్శనమిచ్చారు. శ్రీజ్ఞానపీఠంలో గణపతి చతురావృత్తితర్పణ సహిత శ్రీచక్రనవావరణ అర్చన, నవదుర్గా పూజలు, శ్రీసూక్త పారాయణం జరిగాయి. పరమ గురువులు చందపకానంద నాథుల దివ్య ఆరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీశివ బాలయోగి ఆశ్రమంలో లలితాదేవి అలంకారం, నసనకోట ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వేలాది మంది వాసవీమాత దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలందుకున్నారు. ఎండోమెంట్ ఆధ్వర్యంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో శారదామాత మయూర వాహనంపై కౌమారీదేవి అలంకారంలో పూజలందుకున్నారు. అలాగే ఐదవ రోడ్డు సుంకులమ్మ, మొదటి రోడ్డు చౌడేశ్వరీ దేవి, తపోవనం గాయత్రీమాత, శృంగేరీ శారదా శంకర మఠం, శివకోటి, మారుతీ నగర్ కోదండ రామాలయం తదితర చోట్ల అమ్మవార్లు విశేష అలంకార సేవల్లో పూజలందుకున్నారు. సుభాష్ రోడ్డులో అర్బన్ బ్యాంకు ఎదురుగా చైర్మన్ జేఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లలితామాతను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దర్శించుకున్నారు. జగదీశ్వరాలయంలో పాలసముద్రం నాగరాజు, శ్రీదేవి బృందాలు భక్తిగీతాలు ఆలపించారు.

మహాచండి దేవిగా పార్వతి దేవి

రాప్తాడు: స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని పార్వతి దేవి ఆలయంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పార్వతి దేవి అమ్మవారు మహాచండి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు చెడిపోతుల మురళి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవి అమ్మవారు మహాచండి రూపంలో భక్తులను కటాక్షించారు. జేఎన్‌టీయూ రోడ్డులోని ముత్యాలమ్మ, ఇందిరమ్మ కాలనీలో ఐదో క్రాస్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి, రాప్తాడులో పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు మహాచండి దేవి అలంకరణలో పూజలందుకున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి..

ఆత్మకూరు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూరులోని వాసవీమాత ఆలయంలో అమ్మ వారికి ఉదయం కాత్యాయనిగా, సాయంత్రం అర్ధనారీశ్వరిగా అలంకరించారు. పంపనూరులోని పార్వతి దేవికి, వడ్డుపల్లిలోని సుంకులమ్మ అమ్మవారికి, యాలేరులోని యల్లమ్మ తల్లి వివిధ రూపాల్లో కొలువుదీరారు.



గుత్తి రోడ్డులోని చౌడేశ్వరి ఆలయంలో సంతాన లక్ష్మి అలంకరణ



పాతూరులోని బీరప్ప గుడిలో కొలువుదీరిన అమ్మవారు



లలితా దేవి అలంకరణలో వేదమాత గాయత్రీ దేవి



కౌమారి అలంకారంలో శారదా మాత



అలంకార సేవల్లో లలితా మాత

ఇష్టారాజ్యంగా వాటర్ ప్లాంట్ నిర్మాణం



ఏఎంసీ, ఈఓటీ మధ్యలో వాటర్ ప్లాంట్ నిర్మిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వాటర్ ప్లాంట్ నిర్మాణం వివాదాస్పదంగా మారుతోంది. కాస్త స్థలంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేసుకోవాలని సర్వజనాస్పత్రి అధికారులు ప్లాంట్ ఏర్పాటు చేసే వ్యక్తికి సూచిస్తే వారు ఎక్కువ స్థలంలో నిర్మాణం చేపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఓ పరిశ్రమ నిర్వాహకులు ఆస్పత్రిలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చారు. సర్వజనాస్పత్రి అధికారులు ముందుచూపు లేకుండా అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు మధ్యలో ఉన్న స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలంలో కొద్ది భాగంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయవచ్చు. నిర్మాణం కారణాన్ని చూపి అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌కు బల్లను అడ్డుగా వేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కేసులు, గర్భిణులు, బాలింతలను ఆ మార్గంలో ఏఎంసీ, ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్తారు. నిర్మాణదారుడు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తుండటం అధికారులకు పరిపాలనపై ఏమాత్రం పట్టు ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఇప్పటికైనా ప్లాంట్‌ను అనువైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి.